తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

తిరుపతి ఈస్ట్ ఇన్‌ఛార్జి సిఐగా రామకృష్ణ

-సిఐ శ్రీనివాసులు విఆర్‌కు

తిరుపతి,నవంబర్ 7ప్రభాతవార్త:
తిరుపతి ఈస్టు సిఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును విఆర్‌కు పంపుతూ డిఐజి షిమోషిబాజ్‌పేయి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో తిరుపతి వెస్టు సిఐగా ఉన్న పి.రామకృష్ణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈస్టు సిఐ పనితీరుపై అసహనం కారణంగా ఆయన్ను విఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈస్టుకు నూతన సిఐ నియమితులు కానున్నారు. తిరుపతి జిల్లాలోనే ఈస్టు పోలీసుస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రోటోకాల్ పరిధిలో ఉండటం, నిత్యం యాత్రికుల రాకపోకలు, ప్రముఖుల పర్యటనలు, రాజకీయ నేతలు ఉన్నారు. అంతటి ప్రాధాన్యత పోస్టుకు సమర్థవంతమైన సిఐని నియమించేందుకు జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు చర్యలు తీసుకుంటున్నారు.

కొండపై జోరువాన

తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:

అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుండి తిరుమలలో భారీ వర్షం కురిసింది. గత రెండురోజులుగా వాతావరణంలో మార్పుతో చల్లటిగాలులు వీస్తుండటంతో ఉదయం నుండి కురుస్తున్న వర్షం సాయంత్రం అంధగంట జోరుగా కురిసింది. ఈ వర్షానికి భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. మంచుతో తిరుమలను,ఘాట్‌రోడ్లను కప్పేయడంతో వాహనాలు,భక్తులు దగ్గరగా వస్తేగానీ కనిపించేపరిస్థితి లేదు.

అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చు

కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి హెల్త్, నవంబర్ 7, ప్రభాతవార్త :
అవగాహన ద్వారా క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చునని క్యాన్సర్ వ్యాధి నివారణ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్విమ్స్ ఆసుపత్రి ఎంట్రన్స్ వాల్మీకి విగ్రహం వద్ద క్యాన్సర్ అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు , ఎన్.యు.హెచ్.ఎం స్టేట్ నోడల్ ఆఫీసర్ డా. జె.విజయలక్ష్మి డీఎంఎచ్ఓ డా. శ్రీహరిలతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నమోదవుతున్న మరణాలలో క్యాన్సర్ బారినపడి 5 వ వంతు మరణాలు క్యాన్సర్ ద్వారా సంభవిస్తున్నాయని, వీటిలో వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులతో మరణిస్తున్నారని, ముఖ్యంగా రొమ్ము, నోటి, సర్వైకల్ క్యాన్సర్‌లను ముందుగా స్క్రీనింగ్ చేసి అరికట్టవచ్చని తెలిపారు. కొంతమంది క్యాన్సర్ కారక లక్షణాలు ఉన్నప్పటికీ అవగాహన లేక సరైన సమయానికి చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరు వ్యాధి, నివారణ మార్గాల పై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వైద్య సిబ్బంది అందరూ ఇంటింటికి వెళ్లి పై తెలిపిన మూడు రకాల క్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్ తో పాటు బి.పి మరియు డయాబెటిస్ లను కూడా స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ అనేది 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిలో ఎక్కువగా కనిపిస్తోందని, ఈ లక్షణాలు కల వారిని ముందుగానే స్క్రీనింగ్ లో గుర్తించి దగ్గరలో ఉన్నటువంటి ఏరియా ఆసుపత్రి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కి తీసుకెళ్లి ముందుగా చికిత్స అందించాలని అందుకు సంబంధించిన రేడియోథెరపీ గానీ, కీమోథెరపీ గానీ చేయించాలని అన్నారు. ఈ రోజున క్యాన్సర్ కు సంబంధించిన అవగాహన ర్యాలీనీ తిరుపతి పట్టణం లో నిర్వహించడం జరిగిందని అన్నారు.తిరుపతి శాసన సభ్యులు మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ క్యాన్సర్ నివారణ చర్యలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.ఎల్.ఏ సుగుణమ్మ, రుయా, సిమ్స్ ఆస్పత్రుల సుపరిండెంట్లు డా. రవి ప్రభు, డా. రామ్, ఆర్ ఎం ఓ డా. కోటిరెడ్డి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్, స్విమ్స్ క్యానర్ విభాగ నోడల్ ఆఫీసర్ డా.నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ (పిఆర్ఓ) రాజశేఖర్, ఒమేగా, టాటా క్యాన్సర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలివిడత ఛాన్స్ ఎవరికో!?

ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు !!



ప్రభాతవార్త-తిరుపతి:
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతజిల్లాలో అధికార కూటమిపార్టీల నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తోంది. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీకి మాత్రమే మూడునాలుగు దశాబ్దాలుగా కష్టకాలంలోనూ పార్టీకి కష్టపడిన కేడర్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. జనసేన పార్టీ, బిజెపిల్లో నామమాత్రంగా నేతలను లెక్కించవచ్చనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. 2019లో అధికారం కోల్పోయిన తెలుగుదేశం పార్టీ ఉమ్మడిచిత్తూరుజిల్లాలోనూ దాదాపు 13స్థానాలు గత వైసిపి ఎమ్మెల్యేలే కొనసాగారు. అప్పట్లో వైసిపి నేతలతో, మంత్రులతో కొందరు టిడిపి నేతలు చట్టాపట్టాలు వేసుకుని తిరగడమోగాక చాపక్రిందనీరులా వారితో కలసి కొందరు తమ పనులు చక్కబెట్టుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఏకంగా కొందరు ఒకరిద్దరు టిడిపి నేతలు వైసిపి కీలక నేతల ఇళ్ళకు వెళ్ళి వచ్చేవారనేది ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందిన సంచలన ఇంటెలిజెన్స్ నివేదికలు. దీంతో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో టిడిపి నేతల పనితీరుపై గతంలోనూ అధినేత అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో జనసేనపార్టీ, బిజెపితో కలసి టిడిపి కూటమిపార్టీలుగా ఏర్పడ్డాయి. ఉభయజిల్లాల్లో ఆ రెండు పార్టీలకు పెద్దగా నాయకులు లేరనే చెప్పుకోవచ్చు. తిరుపతిలో అప్పటి పరిస్థితుల్లో జనసేన పార్టీకి టిక్కెట్ ఖరారుచేసి చిత్తూరు నుండి ఆరణి శ్రీనివాసులును ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేయించి కూటమి తరపున గెలిపించారు. ఈ కీలక వ్యవహారంలో టిడిపి కేడర్ నేతలు, కార్యకర్తలు సహకారం మరచిపోలేనిది. తొలినుండి సొంత జనసేన పార్టీలోనే ఆరణికి వ్యతిరేకత వ్యక్తమైంది. అయితే గెలిచిన తరువాత ఎమ్మెల్యేగా ఆయన టిడిపి నేతలకు,కార్యకర్తలకు ప్రాధాన్యతనిచ్చి గట్టిగా పనిచేసిన వారిని గుర్తించాల్సిందిపోయి త్రిమూర్తులకు మాత్రమేూ పట్టంకట్టేశారనే విమర్శలు కూటమి పార్టీల నేతల్లో బహిరంగా వ్యక్తమవుతున్నాయి. ఆ త్రిమూర్తులకు పార్టీలో ఎలాంటి పదవులు లేకున్నా, కుటుంబసభ్యులుగా ఉండటంతో వారి పెత్తనం ఎక్కువైంది. ఎమ్మెల్యేగా ఆరణి నిమిత్తమాత్రంగానే మిగిలిపోయాడనే అపవాదు ఉంది. దీంతో సొంతజిల్లాలో ముఖ్యంగా తిరుపతిలోని టిడిపి నేతలపై అధినేత ఆగ్రహంతోనే ఉండటం ఇప్పటి వరకు ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో సొంత పార్టీలో ఎవరికీ దక్కకపోవడం నిదర్శనంగానే కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పటికే ప్రకటించిన టిటిడి బోర్డులో కూడా తిరుపతి నుండి బిజెపికి చెందిన భానుప్రకాష్‌రెడ్డికి రెండవసారి అవకాశం కల్పించారు. చంద్రగిరి నియోజకవర్గం నుండి కొట్టాలకు చెందిన బంధువు అనిమిని రవి నాయుడుకు శాప్ ఛైర్మన్‌గా, కుప్పంకు చెందిన పార్టీసీనియం నాయకుడు పిఎస్ మునిరత్నంకు ఆర్టీసి ఛైర్మన్‌గా, టిటిడి బోర్డులో వైద్యం శాంతారామ్‌కు సభ్యుడుగా పదవులు దక్కాయి. పూతలపట్టు నియోజకవర్గంకు చెందిన పెనుమూరు ప్రాంత వాసి, వ్యాపారవేత్త, బిఆర్‌నాయుడుకు ఏకంగా టిటిడి ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఇంకా ఒకరిద్దరు పదవులు దక్కించుకున్నారు. ఎన్నో కీలక పదవులు ఇచ్చేయడంతో ఇప్పుడు మలివిడత నామినేటెడ్ పదవులు కూడా పార్టీకి కష్టపడిన తిరుపతికి చెందిన టిడిపి కేడర్ నేతలు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు దక్కే అవకాశాలు లేవనేది పార్టీవర్గాల్లో చర్చ మొదలైంది. ముఖ్యంగా తుడ ఛైర్మన్ పదవికూడా చంద్రగిరి నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి కట్టబెడతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇంకా పలు కీలక పదవులు ఉన్నా ఎవరిని వరిస్తుందనేది ఊహించలేకపోతున్నారు. తిరుపతిలో కొందరు నాయకులు వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం కలిగించారనేది అధిష్టానం దృష్టిలో ఉంది. గతంలో జరిగిన తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఎన్నికలు, తిరుపతి టౌన్‌బ్యాంకు ఎన్నికలు, తిరుపతి ఎంపి ఉప ఎన్నికలను టిడిపి నేతలు సై అంటే సై అనేరీతిలో ఎదుర్కోలేక వైసిపితో పోరాటం చేయలేక చతికిలపడ్డారనేది బాబు గ్రహించిన వాస్తవం. ఒకానొక దశలో పార్టీలో తెలుగుతమ్ముళ్ళనందరినీ కలుపుకుని వెళ్ళేందుకు పరిశీలకులను పంపే పరిస్థితి ఎదురైంది. పార్టీలో బలమైన నేతలు,కొందరు సీనియర్ నేతలు కూడా అసహనంతోనే ఇమడలేక కొనసాగుతున్నారు. తిరుపతి,శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, చిత్తూరు నియోజకవర్గాల నుండి కూటమి పార్టీల్లో టిడిపికే అధికసంఖ్యలో కేడర్ బలంఉంది. ప్రాధాన్యత ఉన్న నాయకులు ఉన్నారు. మరీ వీరిలో ఎవరికి లక్కు ఉందోననేది మూడునాలుగురోజుల్లో ఉత్కంఠ వీడిపోనుంది.

ఇంటి నిర్మాణ పనులు పరిశీలించిన నారా బ్రాహ్మణి

శాంతిపురం, నవంబర్ 7 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు శాంతిపురం మండలం శివపురం వద్ద నిర్మిస్తున్న సొంతింటి నిర్మాణ పనులను సిఎం చంద్రబాబు కోడలు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి గురువారం పరిశీలించారు. నారా బ్రాహ్మణికి ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఎ మనోహర్, సలహాదారు నరేష్‌చారి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని నిర్మాణాలు చేపడుతున్న ఎల్అండ్‌టి ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, అనసూయ, చంద్రకళ, ఉయ్యాలజయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలి

కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి నవంబర్ 7, ప్రభాతవార్త
గిరిజన కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మండలంలోని గుండ్ల సముద్రం గిరిజన వాడలో గిరిజన కుటుంబాల వారికి ఇంటి స్థలాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. అందరూ పిల్లలను బాగా చదివించుకోవాలని కోరారు. గిరిజనులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములను కూడా జీవనోపాధికి ఇస్తామని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గిరిజనులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. టీవీఎస్ సమస్త వారు గిరిజనులకు గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. టీవీఎస్ సమస్య వారు చేస్తున్న సేవలను కొనియాడారు. గిరిజనులకు వలలను కూడా ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజ రెడ్డి, తాసిల్దార్ రాంబాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమోళి రెడ్డి, టీవీఎస్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

దర్శనానికి అఘోరిని అడ్డుకున్న సిబ్బంది

ఆత్మార్పణకు ప్రయత్నం : సిఐతో వాగ్వివాదం అధికారులకు ముచ్చెమటలు

శ్రీకాళహస్తి నవంబర్ 7 ప్రభాతవార్త
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న అఘోరి గురువారం శ్రీకాళహస్తికి వచ్చారు. ఆమె తన సహజ ధోరణితో శరీరం నిండా విభూదీ పూసుకొని చేతిలో శూలం పట్టుకొని రెండవ గేటు ద్వారా రూ.750 రాహుకేతుదోష నివారణ పూజల మండపం వద్దకు చేరుకున్నారు. రెండవ గేటు వద్ద ఆమెను సెక్యూరిటి సిబ్బంది అడ్డుకున్నారు.ఆమె వారిని లెక్క చేయక లోపలకు వెళ్ళింది. సెక్యూరిటి సిబ్బంది వాకీ టాకీలో గేట్ల వద్ద సెక్యూరిటిని అప్రమత్తం చేసారు. దాంతో కొందరు సెక్యూరిటి సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. నగ్నంగా ఆలయంలో ప్రవేశం నిషేదం అని వారించారు.దాంతో ఆమె దేశంలో తమను ఏ ఆలయం వద్ద కూడా అడ్డుకోలేదు. మీరు ఎందుకు అడ్డుకుంటున్నారు. మీకు ఎవరు చెప్పారు? అడ్డుకోమని దేవుని చూడటానికి చట్టాలు, నిబంధనలు ఎందుకంటూ వాదించారు.అయితే సెక్యూరిటి సిబ్బంది ఆమెను తాము అనుమతింపజేస్తామంటూ ఒప్పించి తమ కారువద్దకు తతీసుకొచ్చారు.

ఆత్మార్పణ ప్రయత్నం: సిఐతో వాగ్వివాదం:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శనానికి తనను అనుమతించక తప్పు చేశారని పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుని దర్శించుకొనుటకు రాగా అడ్డుకోవటం పెద్ద తప్పు చేసారన్నారు.తమ ఆరాధ్యదైవం శివయ్యను దర్శించుకోలేని ఈ శరీరం ఎందుకు? అంటూ తమ కారులో సిద్ధంగా ఉంచుకున్న పెట్రోల్ క్యాన్‌ను (10లీటర్ల) తీసి శరీరం నిండా పోసుకున్నారు.దాంతో ఆమె శరీరానికి అలంకరించిన విభూదీ కరిగిపోయింది.అంతేకాక తన కారుపై కూడా పోసారు.దాంతో సెక్యూరిటి సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి. ఇంతలో అక్కడకు టౌన్ సిఐ గోపి చేరుకున్నారు. ఆమె సిఐతో వాదించారు. సిఐ మీరంటే గౌరవం అంటూ సంబోధించారు.దాంతో అఘోరి మాట్లాడుతూ మీరెం చేసుకుంటారో చేసుకోండి. దర్శనం చేసుకుని వెళ్ళి తనను ఎందుకు అడ్డుకున్నారు. లోకం అంతామాదే అంటూ తామే దేవుళ్ళు అని చెబుతున్నారు కదా అని సిఐ గోపి వాదించగా దేవాలయంలో వెలసిన దేవుడు అందరి వాడు అక్కడ దర్శనం చేసుకునే హక్కుల మీకెంత ఉందో తనకు అంతే ఉందని వాదించారు.నాహక్కులను అడ్డుకోకూడదు.నేను మనిషిని నేను పరమేశ్వరుని భక్తురాలిని. నాహక్కును అడ్డుకోవటానికి వీల్లేదన్నారు. అమెకు వస్త్రాలు కట్టటానికి ప్రయత్నించగా అమె తిరస్కరించారు. తమ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు.ఈ వివాదాలపై వివరణ కోరటానికి ఇఓ చరవాణికి ప్రభాతవార్త ప్రయత్నించగా ఆయన అందుబాటులో రాలేదు.

ఉదయం హల్‌చల్..రాత్రి శివయ్య దర్శనం

శివయ్యను దర్శించుకుని వస్తున్న మహిళా అఘోరి

శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకోవడానికి ఉదయం ఇతర ప్రాంతం నుంచి వచ్చిన ఓమహిళా అఘోరిని స్థానిక ఆలయ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండో గేటు వద్ద వాగ్వివాదం చోటుచేసుకోవడంతో తాను వచ్చిన కారుపై పెట్రోలు పోసుకోవడంతో పాటు తనపై కూడా పెట్రోలు పోసుకుని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన విషయం విదితమే. అయితే గురువారం రాత్రి తిరిగి ఆమె వస్త్రాలు ధరించి శివయ్య ఆలయానికి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శనం చేసుకున్నారు.

చేపల వేటకు వెళ్ళి... వృద్ధుడు మృతి

వెదురుకుప్పం, నవంబర్ 7 ప్రభాతవార్త :
చేపల వేటకు వెళ్ళి అనుమానస్పదస్థితిలో ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు ... మండలంలోని గొడుగుచింత సమీపంలోగల రంగా రెడ్డి చెరువులోకి దిగువపల్లాలుకు చెందిన మరో ముగ్గరితో కలిసి బుధవారం చేపల వేటకు వెళ్ళిన సుబ్బరామయ్య(65) నీటమునిగి మృతిచెందిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మండలంలోని దిగువపల్లాలు గ్రామంలోని మహేష్ మామిడి తోట వద్ద సుమారు ఐదు సంవత్సరాలుగా తోటకు కపాలగా తిరుపతి జిల్లా వడమాలపేట మండలం రామరాజుకండిగ చెందిన సుబ్బరామయ్య తన కుటుంబంతో బ్రతుకు తెరువు కొరకు వచ్చి ఇక్కడే స్థిరపడిన్నట్లు చెప్పారు. కాగా మామిడితో నిర్వహణ పనులు చేసుకుంటూ దిగువ పల్లాలు సమీపంలో మామిడితోటలో ఉంటున్న సుబ్బరామయ్య మామిడితోట యాజమాని మహేష్, రామకృష్ణా రెడ్డి, నరసింహా రెడ్డిలతో కలిసి చేపల వేటకు వెళ్ళడం జరిగిందన్నారు. చేపల వల తీసుకుని చెరువులో లోతు ప్రాంతంకు వెళ్ళి మునిగిపోయారని వెతికిన కన్పించలేదని కొందరు చెపుతున్నారు. గురువారం ఉదయం చెరువులో శవమై తేలుతున్నట్లు గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు సంఘటన పై పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెంకటసుబ్బయ్య సిబ్బంది, విఆర్వో నరసింహా రెడ్డి సంఘటన స్థలంకు చెరుకుని మృత దేహంకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన్నట్లు తెలిపారు. మృతినికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దర్యాప్తులో వాస్తవలు వెల్లడికావలస్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

సిఎంఓ ఆదేశించినా.... షికారీల భూముల సర్వేకు మీనమేషాలు..

పుంగనూరు,నవంబరు 7 ప్రభాతవార్త :
కొండకోనల్లో జీవిస్తున్న షికారీ కుటుంబాలకు ప్రభుత్వం ఎపుడో కేటాయించిన వ్యవసాయ భూములను సర్వేచేసి అర్జిదారులకు న్యాయం చేయాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా, వాటిని బేఖాతర్ చేస్తున్న రెవిన్యూ అధికారుల ప్రవర్తన ఇది. మండలంలోని చంద్రమాకులపల్లి రెవిన్యూగ్రామానికి చెంది ఈడిగపల్లి వద్ద ఉన్న షికారీపాలెంలో వంద కుటుంబాలకుపైగా నివసిస్తున్నాయి. వీరికి ఎపుడో పాతికేళ్ళక్రితం ప్రభుత్వం భూములను ఇచ్చి వ్యవసాయం చేసుకోమని చెప్పింది. అయితే, పదేళ్ళక్రితం అధికారబలంతో షికారీల భూములు, అటవీ భూములను ఇక్కడి పెత్తందార్లు ఆక్రమించారు.దీంతో తమ భూములకు వెళ్ళడానికి వారికి ప్రవహించే కాలువ ఒక్కటే దిక్కుగా మారింది. ఇదేమని అడిగిన ప్రతిసారీ షికారీలపై దౌర్జన్యాలు, దాడులు జరిగేవి. ప్రభుత్వం మారడంతో షికారీలు రాష్ట్రముఖ్యమంత్రి కార్యాలయానికి,డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్‌కు,జిల్లా కలెక్టర్,పుంగనూరు దేశం ఇన్‌చార్జి చల్లాబాబు,స్థానిక ఎమ్మార్వోలకు ఈమేరకు ఫిర్యాదు చేస్తూ తమ భూములను సర్వేచేసి ఇవ్వాలని,తమ భూములలో ఇతరుల జోక్యాన్ని నివారించాలని కోరారు. ఈమేరకు సిఎంఓ కార్యాలయం నుంచి సర్వేకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే,రెవిన్యూ అధికారులు సర్వే నిర్వహించకపోగా, ముందస్తుగా సర్వేజరిగినట్లు సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. నాయకులు వాటాలు పంచుకోవడంలో నిమగ్నమైపోగా,ఇలా పార్టీను నమ్ముకున్నవారికి తిప్పలు తప్పడంలేదు.షికారీలు ఈవిషయమై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదుచేయనున్నారు.

ఆధ్యాత్మిక నగర అభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దాం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు..

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 7, ప్రభాతవార్త
ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర అభివృద్ధికి రాజకీయ నాయకులు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గురువారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కమిషనర్ ఎన్.మౌర్య అజెండాను ప్రవేశ పెట్టారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి. సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. వీరితో పాటు డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రమైన మనం నివాసం ఉంటున్నామని ఇది మనకెంతో అదృష్టం అన్నారు. రాజకీయాలను వదిలి అందరం కలిసికట్టుగా కూర్చుని చర్చించుకుని నగర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న నిధులను అవసరాలను బట్టి కార్పొరేటర్లతో అధికారులు చర్చించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలన్నారు. నగరపాలక సంస్థలు కార్పొరేటర్లు కూర్చునేందుకు హాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు తెలిపామన్నారు. నగరంలో ఉన్న పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించి, వాకింగ్ టాక్ మరమ్మతులు చేయాలని అన్నారు. టిడిఆర్ బాండ్లు కొరకు పెద్ద సంఖ్యలో బాదితులు వస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు. నగరంలో రోడ్లకు పాట్స్ వర్కులు, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేటర్లు శ్రీవారి దర్శన ఏర్పాట్ల కొరకు బోర్డులో చర్చించి మంచి నిర్ణయం తీసుకునేలా చూస్తానని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి మన అజెండాగా అందరూ ముందుకుసాగాలని అన్నారు. మంచి నిర్ణయాలకు మన కౌన్సిల్ వేదిక కావాలని, లేని పోని చర్చలు వద్దు అన్నారు. మనం చేసే అభివృద్ధి ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగేలా నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందన్నారు. హోటల్స్ లో ఆహార పదార్థాలు సరిగా ఉండడం లేదని, అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందం ఏర్పాటు చేయాలన్నారు. ఎం.పి., ఎమ్మెల్యే లు చొరవ చూపి నగర అభివృద్ధికి నిధులు తెప్పించాలని కోరారు. పలువురు కార్పొరేటర్లు మరిన్ని నిధులు వెచ్చించాలని కోరారు.

ఎంఎస్ఎంఇ ప్రమోషన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు

కుప్పంరూరల్, నవంబర్ 7 ప్రభాతవార్త ఎంఎస్ఎంఇ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుప్పంకు చెందిన శ్రీనివాసులును నియమిస్తూ ఎంఎస్ఎంఇ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ జితేంద్ర ఉమాకాంత్ వాఘేలా ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఈపదవిలో శ్రీనివాసులు కొనసాగుతారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సిఎం చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజుపల్లిలో 5.50లక్షలతో నూతన సిసి రోడ్లు

పెద్దపంజాణి, నవంబర్ 7 ప్రభాతవార్త మండలంలోని రాజుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో 5.50లక్షలతో నూతనంగా సిమెంట్ రోడ్ల నిర్మాణపనులను మాజీ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి భానుప్రతాప్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రిజ్వానా, విఆర్వో కృష్ణంరాజు, సుకుమార్‌యాదవ్,విఇఎశ్రీకాంత్, నేతలు బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నాగరేఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనబాక లక్ష్మిని సన్మానించిన కేవీబీ పురం నాయకులు

కేవీబీ పురం, నవంబరు 7 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన మాజీ కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పనబాక లక్ష్మిని కేవీబీ పురం మండల టీడీపీ నేతలు కలసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నేతలు రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, సర్పంచ్ దొరబాబునాయుడులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. కలసిన వారిలో మర్రిగుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు మస్తాన్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూలు వద్ద విద్యార్థులకు భద్రత కల్పించాలి

కేవీబీ పురం, నవంబరు 7 ప్రభాతవార్త: దేవిపురం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాల, కాలేజీలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు భద్రత కల్పించాలని మోడల్ స్కూల్, కాలేజీ కమిటీ చైర్మన్ అవసరం సురేష్‌రెడ్డి ఎస్ఐ వెంకటేష్‌కి వినతిపత్రం అందజేశారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు పోలీసు అధికారులు పాఠశాల వద్దభద్రత కల్పించాలని లేకుంటే రోజు రోజుకు ఆకతాయిలు పాఠశాలలో చదువుకుంటున్న ఆడపిల్లలకు భద్రత కరువైందని తల్లిదండ్రులు ఆడ పిల్లలను పాఠశాలకు పంపాలంటే భయాం దోళనకు గురవుతున్నారని వారికి భద్రత భరోసా ఇచ్చి వారు చదువుకోడానికి భద్రత కల్పించాలన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలలో చదువుతున్న బాలికలకు హాస్టల్ రోడ్డు పక్కన ఉండడం వలన హాస్టల్‌కు వెంటనే కాంపౌండ్ వాల్‌ని ఏర్పాటు చేయాలని ఆదర్శ పాఠశాల చైర్మన్ సురేష్‌రెడ్డి కోరారు. రోడ్డు పక్కన పాఠశాల, ఆడ పిల్లలు హాస్టల్ ఉన్నందున అదే విధంగా ప్రహరీగోడ లేదని, కేవీబీ పురం మండల ఇన్‌చార్జి ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు.

నాయుడుపేటలో వర్షం ...

నాయుడుపేట నవంబరు 07 ప్రభాతవార్త;

నాయుడుపేట పట్టణం-మండలంలోని పలుగ్రామాల్లో బుదవారం నుండి వర్షం పడుతుంది. ఈవర్షంతో గ్రామాల్లో రైతులు సాగుచేపట్టిన ఎల్దిపైరుకు కొంత వరకు ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో నాయుడుపేటలో వర్షాలు కురుస్తున్నాయి. మూడురోజుల నుండి వరుసగా కురుస్తున్న వర్షాలకు నాయుడుపేట పట్టణం-గ్రామాల్లోని వీదులు బురధమయంగా మారుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రైతులు వరినాట్టు,వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ సూచిన వాగులు,వంకల్లో వర్షపునీరు ప్రవహిస్తుంది. వర్షాలకు జాతీయరహదార్లు సైతం గుంటలు ఏర్పడి అద్వానంగా మారుతున్నాయి.

శివయ్య సేవలో ముంబై జడ్జి

శ్రీకాళహస్తి,నవంబర్ 7 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ముంబై హైకోర్టు జడ్జి డబ్ల్యు సంబరే కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ ఇఒ బాపిరెడ్డి ఆదేశాలతో పిఆర్ఓ రవి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయంలో దర్శించుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలను అందించారు.

రేపు విశ్వ వ్యాప్త దివ్య అఖండ నామ సంకీర్తన

చిత్తూరురూరల్, నవంబరు 7 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలోని అన్ని భజన మండలి నందు ఈనెల 8వ తేది శనివారం సాయంత్రం 6 గంటలనుంచి ఆదివారం సాయంత్రం 6గంటల వరకు విశ్వ వ్యాప్త దివ్య అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎస్. మధుసూదనం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అఖండ నామ సంకీర్తన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల, నవంబర్ 7, ప్రభాతవార్త క్యాన్సర్ వ్యాధిపై ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేస్తూ రొంపిచెర్ల పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం జాతీయ క్యాన్సర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం చాలా కష్టమన్నారు. 30 సంవత్సరాలకు పైబడిన వారు 6 నెలలకు, సంవత్సరానికి ఒకసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే క్షయ వ్యాధుల రాకుండా 60 సంవత్సరాలు పైబడిన వారు అడల్ట్ బీసీజీ ఇంజక్షన్ వేసుకోవాలన్నారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ నెల 14 నుంచి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లెలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

తవణంపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో గురువారం మండల వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ టిఎస్.మోహన్‌వేలుల ఆధ్వర్యంలో మండల వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదాలు చేస్తూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ముందస్తు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించుకుని రక్షణ పొందాలని ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో మండల వైద్యాధికారులు మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌కు దూరంగా వుండాలంటే సిగిరెట్, బీడీ, గుట్కా వంటి వాటిని వాడకూడదన్నారు. ఈమేరకు స్థానిక పీహెచ్‌సీ నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామ పురవీధుల గుండా సాగింది. ఈకార్యక్రమంలో మండల సీహెచ్ఓ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

తవణంపల్లె, నవంబర్ 7 ప్రభాతవార్త: ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మీ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆమె తవణంపల్లె ఎంఆర్‌సీని, అరగొండ జడీ ్న ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో విద్యాభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈమేరకు పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థుల గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వందశాతం ఫలితాలు సాదించాలన్నారు. అలాగే 2,3,4,5 తరగతుల్లో విద్యార్థులందరికి తెలుగు, ఇంగ్లీషులో చదవడం, రాయడం నేర్పించాలన్నారు. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లును పరిశుభ్రంగా వుంచుకోవాలని, మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసి పిల్లలకు అందించాలని సూచించారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఇఎస్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

కుప్పం, నవంబర్ 7 ప్రభాతవార్త పిఇఎస్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, కర్ణాటక ప్రభుత్వ విద్యసలహాదారు డా॥ ఎంఆర్ దొరస్వామినాయుడు జన్మదినం సందర్భంగా శెట్టిపల్లి బధిర పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు గురువారం పిఇఎస్ మేనేజ్‌మెంట్ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అ ంతకు ముందు పిఇఎస్ ఆస్పత్రిలో రోగులకు పాలు, పళ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఛైర్మన్ జన్మదిన సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. ఛైర్మన్ డా॥ దొరస్వా మినాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని డీన్, ప్రిన్సిపాల్ డా॥ కృష్ణారావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా॥ హరీష్ కుమార్, ఎంఎస్ డా॥ సుబ్ర మణ్య, ఎఎంఎస్ డా॥ మోహనరూప, డా॥ శ్రీధర్, హెచ్ఆర్ మేనేజర్ రాజ్‌కుమార్, అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ అబిలాష్, ఆస్పత్రి సిబ్బ ంది పాల్గొన్నారు.

నూతన వధూవరుల్ని ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, నవంబర్ 7 ప్రభాతవార్త మండలంలోని కరసనపల్లి మాజీ సర్పంచ్ సుబ్రమణ్ం కుమార్తె గాయత్రి వివాహ వేడుకలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అక్షరజ్ఞానులుగా చేయడమే " ఉల్లాస్ "లక్ష్యం : లీలామాధవి

చౌడేపల్లి, నవంబర్ 7 ప్రభాతవార్త నిరక్షరాశ్యులను అక్షర జ్ఞానులుగా చేయడమే " ఉలాస్ "లక్ష్యమని ఎంపిడిఓ లీలామాధవి అన్నారు. స్థానిక ఐకెపి భవనంలో మండలంలోని విలేజ్ వాలంటీర్లకు ఉల్లాస్‌పై అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 18 యేళ్ళు పైబడిన 1385మంది నిర్లక్ష్యరాశ్యులను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూ నిటీ భవనాలు, ప్రాథమిక పాఠశాలల్లో వారిని అక్షర జ్ఞానులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. అనంతరం ఉల్లాస్ బోధనా పద్ధతులపై శిక్షణలిచ్చారు. ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం, సిసిలు సుగుణ, రమేష్, శ్రీనివాసులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

పొగాకు జోలికి వెళ్ళద్దు.. క్యాన్సర్‌ను కొని తెచ్చుకోవద్దు

చౌడేపల్లి, నవంబర్ 7 ప్రభాతవార్త పొగాకు ఉత్పత్తుల జోలిక వెళ్ళద్దు క్యాన్సర్‌ను కొని తెచ్చుకోవద్దని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం 29ఎ.చింతమాకులపల్లిలో క్యాన్సర్ వ్యాప్తిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి రాకముందే జాగ్రత్తలు పాటించాల న్నారు. క్యాన్సర్‌వ్యాధినిగురించివివరించారు. ఎఎన్ఎం నాగలక్ష్మి, దివ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి జనసేన పార్టీ సాయం

సోమల, నవంబర్ 7 ప్రభాతవార్త సోమల మండలం వల్లిగట్ల పంచాయితీ గల్లూవారిపల్లికి చెందిన జి. పవన్ కుమార్‌కు జనసేన నాయకులు గురువారం వీల్ ఛైర్ అందించి ఆర్థిక సాయం అందించారు. నెల రోజుల క్రితం కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడి వెన్ను పూస దెబ్బ తినడంతో పవన్ కుమార్ ఇంటికే పరిమితం అయ్యాడు. కందూరుకు చెందిన డాక్టర్ హరినారాయణ బాధితునికి వీల్ ఛైర్ అందించి ఆదుకున్నాడు. ఈ కార్యక్రమంలో బండారు రఘు, కోన శేఖర్, రామకృష్ణ, ప్రభు, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వం వద్దు: చల్లా

పుంగనూరు, నవంబరు 7 ప్రభాతవార్త : నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడంలోనే అధికారుల సామర్థ్యం ఉండాలని, పనులలో జాప్యం వద్దని దేశం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలాల వారిగా ప్రతి ప్రాంత, పథకాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఉపాధిపనులలో నియోజకవర్గంలో ప్రగతిలేకపోవడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధిపథకాన్ని నిర్వహిస్తోందని, గ్రామాలలో ప్రతి రైతు ప్రతి వ్యక్తికూడా ఉపాధి పథకం ద్వారా లబ్ధి పొందాలన్నారు. మండలాల వారిగా నియోజకవర్గంలో ఉన్నత అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధమౌతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు,ఎంపిడిఓలు, వ్యవసాయ, ఉపాధిశాఖల అధికారులు సిబ్బంది,ఫీల్డ్ అసిస్టెంట్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూజాగరణ సమితి అధ్యక్షుడుగా పరమేష్

పుంగనూరు,నవంబరు 7 ప్రభాతవార్త : హిందూజాగరణ సమితి పట్టణాధ్యక్షుడుగా పరమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కొత్తఇండ్లు సాయిబాబా ఆలయ ఆవరణలో జరిగిన ఈకార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడుగా గంగాధర్,ప్రధాన కార్యదర్శిగా హరీష్‌లు ఎన్నుకోబడ్డారు. పరమేష్ మాట్లాడుతూ సనాతన హిందూధర్మ పరిరక్షణే ధ్యేయంగా,హిందువుల ఐకమత్యం అభిమతంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

చల్లాను సత్కరించిన చింతపండు వ్యాపారస్తులు

పుంగనూరు,నవంబరు 7 ప్రభాతవార్త : నియోజకవర్గ దేశం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని చింతపండు వ్యాపారస్తుల సంఘం గురువారం ఘనంగా సత్కరించింది. స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన చింతపండు వ్యాపారుల ఆత్మీయ సమావేశంలో చల్లా పాల్గొనడంతో సంఘ నాయకులు ఆయనకు శాలువకప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకుడు సయ్యద్ సుహేల్ సారధ్యంలో జరిగిన ఈసమావేశంలో పట్టణానికి చెందిన చింతపండు వ్యాపారస్తులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దేడమే ధ్యేయం

డక్కిలి, నవంబరు 7 ప్రభాతవార్త; పల్లెల్లో ఉన్న నిరక్షరాస్యులు అయిన మహిళలను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అక్షరాస్యత కార్యక్రమం అములకుసంబందించి వాలంటీర్ టీచర్లుకు,వీవోలు క్లస్టరు కోఆర్డినేటర్లుకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో వాలంటీర్ 15మందిని అక్షరాస్యులను చేయాలన్నారు. చదువుకు అవసరమై సామగ్రితో పాటు విద్యనభ్యసించే వయోజన మహిళలకు రోజుకు రూ. 25 ఇవ్వడం జరుగుతుందన్నారు. వయోజనులు ఖాళీగా ఉండే సమయాలలో విద్యను భోదించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమాన్నీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అములు చేస్తున్నట్లు,వాలంటీర్లు శ్రద్ధగా పని చేయాలని తెలియజేశారు. ఎంఈవో జగదీష్‌బాబు, వెలుగు ప్రాజెక్టు ఏపీఎం జమునారాణి,సీసీలు,పోదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో నూతన సంస్కరణలు

– ఏపీ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

కోట, నవంబర్ 7 ప్రభాతవార్త

నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)లోని సాంకేతిక విద్యలో నూతన సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఏపీ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి చెప్పారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మెకానికల్ విభాగంలో జరుగుతున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నాలుగవ రోజు గురువారం ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఇపి జాతీయ విద్యావిధానం ప్రాముఖ్యతను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విధానాలను అమలుపరచడంలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజ యకుమార్‌రెడ్డి ఆయనకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి సిహెచ్ విక్రమ్‌కుమార్, సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధి కె.రవిశంకర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం

కోట, నవంబర్ 7 ప్రభాతవార్త కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సిఎస్ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సురేష్‌బాబుకు అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం సురేష్‌బాబును డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నారాయణ రావులు అభినందించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎన్.గీతాంజలి ఆధ్వర్యంలో 'యాన్ ఎన్‌హాన్స్‌డ్ఎనర్జీ ఆప్టిమైజేషన్ ట్రస్ట్ మోడల్స్ ఫర్ ఇంప్రూవైసింగ్ ది లైఫ్ టైం త్రుహురిస్టిక్ అప్రోచెస్ ఆన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై పరిశోధనలకు సురేష్‌బాబుకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. మెరుగైన బోధనకు, మంచి ఫలితాలు సాధించడానికి,కళాశాలఅభివృద్ధికిఇలాంటి డాక్టరేట్ కలిగిన అధ్యాపకులు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

నాయుడుపేట, నవంబర్ 7 ప్రభాతవార్త ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలకు పోలీసులు ఏమాత్రం వెనుకాడరని నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. ప్రతి ఆటోడ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణికులు, మహిళల పట్ల గౌరవ మర్యాదాలు పాటించాలన్నారు. శుక్రవారం నాయుడుపేట డిఎస్పీ కార్యాలయంలో ఆటోడ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఆటోడ్రైవర్ లైసెన్సు కలిగి ఉండటంతో పాటు తప్పకుండా యూనిఫాం ధరించి ఉండాలని, ఆటోలకు సంబంధించిన ధ్రువపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. మహిళలు ఎవరైనా తమ పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే 112 నంబరుకు సమాచారం అందించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. సిఐ బాబి మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బస్టాండు నుంచి వెల్‌కం సెంటరు మీదుగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి గాంధీబొమ్మకు వెళ్లాలని, అలాగే గాంధీబొమ్మ నుంచి వచ్చే వాహనాలు పోలేరమ్మ గుడి నుంచి పోలీసుస్టేషన్ మీదుగా ఆర్టీసీకి వెళ్లాలన్నారు. ప్రతి ఆటోడ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పట్టణంలో కొందరు ఆటోడ్రైవర్లు ఇఎంఐలు నెలల తరబడి కట్టకుండా నేరం చేసేందుకే ఆటోలను కొనుగోలు చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఆటోడ్రైవర్లపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీహరిబాబుతో పాటు నాయుడుపేట పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఆటోడ్రైవర్లు ఉన్నారు.

కలుపు మందులతో భూమి నిర్జీవం

– డిఆర్‌సి భాస్కరయ్య

చిట్టమూరు, నవంబర్ 7 ప్రభాతవార్త రైతులు తమ భూములకు అధికంగా కలుపు మందులు వాడటం ద్వారా భూమిలో జీవం పోసి సారవంతమైన భూములు సైతం నిర్జీవమై నిస్సారవం తమవుతాయని జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య వెల్లడించారు. శుక్రవారం చిట్టమూరు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలుపు మందులు భూమిలో జీవరాశులను చంపి మొక్కకు అవసరమైన పోషకాలు అందకుండా చేస్తాయని సూచించారు. రైతులందరు సాగు పద్ధతులు సక్రమంగా పాటిస్తే కలుపు మందులు అవసరం అంతగా ఉండదన్నారు. ప్రధానంగా పంటలకు అధికంగా రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వలన నేల కాలుష్యానికి గురై తద్వారా మానవుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఆరోగ్యవంతమైన పంటకు సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు శ్రీరామరక్ష అని తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు వరిలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి ఈ సందర్భంగా రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు అవసరమైన ఎరువులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని, రైతులందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టమూరులో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం

చిట్టమూరు, నవంబర్ 7 ప్రభాతవార్త చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రీ

అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

రామ్ అకాడమీ కాలేజ్ కరస్పాండెంట్ ఎం. మధుసూదన్

తిరుపతి క్రీడ, నవంబర్ 7, ప్రభాతవార్త తిరుపతి ఎంఆర్ పల్లిలోని న్యూ బాలాజీ కాలనీ రామ్ అకాడమీ కాలేజ్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ యువ జన సర్వీసుల శాఖ సారధ్యంలోని నెహ్రూ యువ కేంద్ర సహకారంతో పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా జిల్లా యూత్ ఆఫీసర్ ప్రదీప్,డిస్ట్రిక్ అకౌంట్స్ ఆఫీసర్ బాబు రెడ్డి సూచనల మేరకు ఏక్ పెడ్ మా కి నామ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు నాటండి) అనే అవగాహన సమావేశం కళాశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించడం జరిగిందని పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ తిరుపతి అర్బన్ మండలం బయోడైవర్సిటీ కమిటీ కో ఆర్డినేటర్ పి. అమర్నాథ్ తెలియజేసినారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రామ్ అకాడమీ కాలేజ్ కరస్పాండెంట్ శ్రీ సాయి కళా ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ ఎం. మధుసూదన్ విచ్చేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థులు యుక్త వయసు నుండే సమాజం పట్ల అవగాహన పెంచుకొని తమ బాధ్యతగా భావించి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం కోసం తమ చుట్టూ యువతను చైతన్యవంతులను చేయాలన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి అనే నినాదంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శ్రీ భారతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ కార్య దర్శి ఎస్ ఎన్ రాజా, కెమిస్ట్రీ లెక్చరర్ అర్ వి ప్రభాకర్ రాజు, తిరుపతి మండలం ఫారెస్ట్, బయో డైవర్సిటీ కమిటీ మెంబర్లు జీ. శ్రీనివాసులు, ఏం. వెంకటేష్, ఎం రమేష్ మరియు యువతీ యువకులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బ్లూకలర్‌డే

శ్రీకాళహస్తి,నవంబర్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో పేరెన్నిక గన్న పబ్లిక్ పాఠశాలల్లో ముత్యాలమ్మగుడివీధిలోని 'ఆక్స్‌ఫర్డ్' పబ్లిక్ స్కూల్ ఒకటి. ఇక్కడ చిన్నారులకు చక్కటి విద్యాబుద్ధులతో పాటు సంప్రదాయం, సంస్కృతి,క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి చక్కటి ప్రణాళికలతో విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు.ఈ నేపథ్యంలో గురువారం పాఠశాల ఆవరణలో బ్లూకలర్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కరస్పాండెంట్ మధుసూధనరెడ్డితో పాటు ప్రీప్రైమరి ఇన్‌చార్జి శ్రీలత,ఎల్‌కేజీ టీచర్స్ ముస్కాన్,సుమతి, ప్రీప్రైమరిటీచర్ శశికళలు పాల్గొన్నారు.

వే టాటా ఫౌండేషన్ వారిచే ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి నవంబర్ 7 ప్రభాతవార్త

వే ఫౌండేషన్,టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి (స్వీకర్)వారి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఉచిత క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంస్థ వ్యవస్థాపకులు పైడి.అంకయ్య మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రాణాంతక వ్యాధులలో ఒకటని దానిని ముందే గుర్తిస్తే అరికట్టవచ్చునన్నారు.ఈ మేరకు ప్రతి ఏడాది నవంబర్ 7 న జాతీయ క్యాన్సర్ పై అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటామని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ మహమ్మరిని ఆదిలోనే గుర్తించకపోతే ఎన్నో సమస్యలకు గురికావాల్సి వస్తోందన్నారు.టాటా ట్రస్ట్ వారు వెంకయ్యబాబు బృందం, హేమంత్‌రెడ్డి,కుమారి,అమరావతి,మహేంద్ర,ఉమెన్ సెల్ కో ఆర్డినేటర్ శైలజలు పాల్గొన్నారు.

స్నేహితునిపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

శ్రీకాళహస్తి,నవంబర్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని జెట్టిపాళెంలో స్నేహితుడుపై వారి కుటుంబంపై కత్తితో దాడి చేసిన సంఘటనలో నిందితుడు మునికుమార్ అనే ముని ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లుఅర్బన్ సిఐ డి.గోపి వివరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న వేకువ జామున జెట్టిపాళెంలో నివాసముంటున్న సతీష్‌పై దాడి చేసినట్లు ఆయనతో పాటు కుటుంబసభ్యులపై దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది, ఈ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సిఐ గోపి వివరించారు. గురువారం మధ్యాహ్నం మునిని పట్టణంలోని సన్నిధివీధిలో అరెస్టు చేసి ఆతని నుంచి నేరానికి ఉపయోగించిన కత్తి, ఆటోను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు వివరించారు.ఈ సంఘటనలో సతీష్‌తో పాటు ఆతని భార్య కీర్తన,మామ గణేష్ గాయపడ్డారని సిఐ వివరించారు.

గుడిమల్లంలో భాష్యం పూజలు

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలోని ప్రముఖ శైవాలయం చారిత్రక దివ్యక్షేత్రం గుడిమల్లం ఆలయంలో వెలసిన పరశురామేశ్వరుని గురువారం పెద్దకూరపాడు ఎంఎల్ఏ భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మెన్ బత్తల గిరిబాబు, ఇఒ రామచంద్రారెడ్డిలు స్వాగతం పలికారు. ఆయనతో పాటు టివిప్రసాద్,నవిన్ స్వర్ణ ఉన్నారు.మహిమా న్విత మైన స్వామిని దర్శించుకున్న వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలను అందించారు.

విద్యార్థి అదృశ్యం-కేసు నమోదు

.శ్రీకాళహస్తి, నవంబర్ 7 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని లింగనాయుడుపల్లి పంచాయతీ కురవకనేరి గ్రామానికి చెందిన కోగిల ఓసూరయ్య కుమారుడు నంద కిషోర్(12) స్థానిక కొత్తపేటలోని వివేకానంద పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. నందకిషోర్ గురువారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చి పాఠశాలలో బ్యాగ్ పెట్టి వెళ్ళిపోవడంతో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు కంగారుపడుతూ చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పట్టణ పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్‌ను సత్కరించిన జిల్లా విద్యాశాఖాధికారి

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 7 ప్రభాతవార్త

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌ను తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎస్.కుమార్ గురువారం తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రీసోర్స్ పర్సన్ శిక్షణ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడైన కూనాటి సురేష్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కుమార్ ప్రశంసించి, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి వంశీరాజా, సైన్సు జిల్లా కోఆర్డినేటర్ నీలకంఠ, జిల్లా ఆంగ్ల రీసోర్స్ పర్సన్ భాగ్యశేఖర్, గణిత రీసోర్స్ పర్సన్ మురళీ, తెలుగు రీసోర్స్ పర్సన్ కిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌కళాశాల క్రీడల్లో మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ

తొట్టంబేడు, నవంబర్ 7 ప్రభాతవార్త

ఎస్వీ యూనివర్సిటీ అంతర కళాశాల క్రీడాపోటీల్లో పాల్గొన్న శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా కళాశాల క్రీడాకారులు ఈనెల 5,6 తేదీల్లో జరిగిన బాల్ బాడ్మింటన్ విభాగంలో ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో ప్రథమస్థానం సాధించడంతో పాటు, టెన్నిస్ డబుల్స్ విభాగంలో ద్వితీయ రన్నర్ దక్కించుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ రాజశేఖర్ మరియు అధ్యాపకులు ప్రభుత్వ మహిళా కళాశాల పిడి నరసింహారావుకి అభినందనలు తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో ఈశ్వరి, స్వప్న, సంఘవి, సునీత, సౌజన్య, ఉమా, శ్రీకవి, లక్ష్మిదేవి,, టెన్నిస్ డబుల్స్ పోటీల్లో స్వప్న, ఉమా, చదరంగ పోటీల్లో మౌళిక మరియు రాణిలు రాణించారని ప్రిన్సిపల్ వివరించారు.

స్వయం సహాయక సంఘాల వివరాలు ఎస్‌హెచ్‌జిలో పొందుపరచాలి

శ్రీకాళహస్తి, నవంబర్ 7 ప్రభాతవార్త

స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారం పొందుపరచాలని మెప్మా పిడి రాధమ్మ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బిఎన్.గిరికుమార్ ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాల యంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబందించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్‌లో పొందుపరచాలని పిడి రాధమ్మ తెలిపారు. గత కొద్దిసంవత్సరాలుగా మెప్మాలో ఉన్న మహిళా సంఘా లకు సంబందించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేనందు వల్ల ప్రస్తుతం మిషన్ డైరెక్టర్ మెప్మా గుంటూరు వారి ఆదేశాల మేరకు యాప్‌లో వాస్తవిక సమాచారాన్ని పొందుపరచుటకు శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. యాప్‌లో పొదువు వివరాలతో పాటు సభ్యులకు సంబందించిన ప్రాథమిక, సాంఘిక మరియు ఆర్థిక వాస్తవిక సమాచారాన్ని పొందుపరచడం జరుగుతుందన్నారు.జిల్లా స్థాయిలో పనిచేస్తున్నటిఈలుకృష్ణవేణి,గోపి,ప్రమీల, సిఎంఎం జయరాం,సిఓలుదినకర్, విష్ణు, స్వాతి, పాల్గొన్నారు.

సైబర్ క్రైం నేరాలపై విద్యార్థులు అవగాహన

శ్రీకాళహస్తి, నవంబర్ 7 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్ సైన్సెస్(స్కిమ్స్) కళాశాలలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు కళాశాలలో సైబర్ క్రైంలో నిపుణులు ఐఎల్.నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు గురించి మరియు ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి మోసాలు, డిటిటల్ అరెస్టులు, లోన్‌యాప్స్ మరియు స్మార్ట్ ఫోన్స్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , అదేవిధంగా పార్సెల్ మోసాలు, ఫేక్ వాయిస్‌కాల్స్, ఫేక్ వాట్సాప్‌కాల్స్, గూగుల్ సెక్యూరిటీ మీద, మెయిల్స్ మోసాలు, పాస్‌వర్డ్‌మోసాలు, డిజిటల్ పుట్ ప్రింట్స్, క్రెడిట్ కార్డు మోసాలు, ఎంటిఎం కార్డ్స్ మోసాలు, వాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి డిఎస్‌పి నరసింహమూర్తి, రూరల్ సిఐ రవినాయక్, ఎస్ఐ నరసింహారావు, మరియు పోలీసు సిబ్బందికళాశాలయాజమాన్యండైరెక్టర్‌మిద్దెలహరి, ప్రిన్సిపల్, ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపు అందరి బాధ్యత : ఎంపీడీవో

సత్యవేడు, నవంబరు 7 ప్రభాతవార్త: సత్యవేడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నవభారత్ ఉల్లాస్ కార్యాలయంలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘ మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రధాన లక్ష్యంగా నవభారత్ ఉల్లాస్ కార్యక్రమం కొనసాగించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛంద వలంటీర్లతో ప్రతి పంచాయతీలోను విద్యాదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలో 45 కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్యూఎస్ ప్రపంచ వర్సిటీ ర్యాంకింగ్లో ఎస్వీయూకు ప్రథమ స్థానం

తిరుపతి విద్య, నవంబర్ 07 ప్రభాతవార్త: క్యూ ఎస్ వర్సిటీ ర్యాంకింగ్స్ ఆసియా -2025 నందు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం 581-600 పరిధిలో స్థానం సాధించింది.2025 విద్య సంవత్సరానికి ర్యాంకింగ్ అంచనా వేయడానికి పెకింగ్ వర్సిటీ,హాంగ్ కాంగ్ వర్సిటీ మరియు నేషనల్ యానివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లు ప్రాతినిధ్యం వహించాయి.పరిశోధన,నూతన ఆవిష్కరణలు,ఉపాధి కల్పన అభ్యసన అవగాహన ప్రక్రియ,అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలతో వర్సిటీ ర్యాంకింగ్ నిర్ణయిస్తాయి.వర్సిటీ ఉప కులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ విద్యా వ్యవస్థ ర్యాంకింగ్ నందు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థానం సంపాదించడంతో పాటు ఆంధ్రప్రదేశంలోని వర్సిటీలలో మొదటి స్థానం సాధించడం గర్వించదగ్గ విషయం అనీ,అంకితభావం కలిగిన అధ్యాపకులు, పరిశోధకులు,విద్యార్థులు,అధ్యాపకేతర సిబ్బంది సమిష్టి కృషితోనే ఇది సాధ్యమని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ ఈ విజయం గర్వించదగిందనీ ఈ పరంపరను ఇలానే కొనసాగించి మరింత పురోగతి సాధిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి,ఆచార్య నరసయ్య,ఆచార్య సుధారాణి,ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా నైపుణ్య గణన

వడమాలపేట, నవంబరు 7 ప్రభాతవార్త:

నైపుణ్య గణన 2024 సంబంధించిన సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని వడమాలపేట ఎంపీడీవో శేషగిరి రావు అన్నారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నైపుణ్యగణనపై కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్వేలో 15 నుంచి 59 సంవత్సరాల వయసు గల వారి నుంచి సమగ్ర సమాచారం తీసుకోవాలన్నారు. ఆధార్ ఆధారిత ఓటీపీ, బయోమెట్రిక్ ద్వారా యానిమరేటర్లు వివరాలను సేకరిస్తారని, ఓటీపీసిన బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో విస్తారణ అధికారి దయాసాగర్, స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ శ్రావణి పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు గౌరవ వేతనం కల్పించండి

రేణిగుంట, నవంబరు 7 ప్రభాతవార్త: ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులైన పంచాయతీ వార్డు మెంబర్లకు గౌరవ వేతనం కల్పించాలని రేణిగుంట మేజర్ పంచాయతీ 5వ వార్డు మెంబరు మహబూబ్ బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ మెంబర్లు, జిల్లా పరిషత్‌చైర్మన్‌లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తున్నదని వారికి మాదిరి వార్డు మెంబర్లు కూడా ప్రజాప్రతినిధులేనన్నారు. వార్డు మెంబర్లకు గౌరవ వేతనం కల్పించాలని ఆయన విజయవాడ జనసేన కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు అదే విధంగా తెలుగుదేశం పార్టీ ప్రజా వేదికలో మంత్రి నక్క ఆనంద్‌బాబుకు వినతిపత్రాలు సమర్పించామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపిన వెంకటరెడ్డి కండ్రిగ గ్రామస్తులు

కేవీబీ పురం, నవంబరు 7 ప్రభాతవార్త: పిచ్చాటూరు మండలం వెంకటరెడ్డి కండ్రిగ పంచాయతీ ప్రజల ఆమోదం మేరకు సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆ గ్రామస్తులు ఎమ్మెల్యేని గజమాలతో సత్కరించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల ప్రజలకు రైతులకు ఎంతో ప్రయోజనమని వారు తెలిపారు. అడిగిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేయడంతో వెంటనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు సమాయతమయ్యారని ఎంతో ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని వారు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్, ఫ్లాగ్‌డే

పుత్తూరురూరల్, నవంబరు 7 ప్రభాతవార్త: ఫ్లాగ్‌డే సందర్భంగా పుత్తూరులో వివిధ జడ్పీ హైస్కూలు స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లాగ్‌డే సెలబ్రేషన్ సందర్భంగా ముఖ్య అతిథిగా పుత్తూరు డీఎస్పీ పాల్గొని విద్యార్థులు ఉన్నత స్థాయికి మంచి అవకాశమని ఇది ప్రతి విద్యార్థి మంచి డిసిప్లేన్ మారుపేరు స్కౌట్స్ అండ్ గైడ్స్ అని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వరులు, గైడ్ కెప్టెన్ సుకన్య, గైడ్ లీడర్ జోష్ణ, కావ్య, యువశ్రీ, కవిత, స్కౌట్ లీడర్ మహీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య,నవంబర్ 7,ప్రభాతవార్త: స్థానిక పశువైద్య కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహర చారి,డిఎస్పి ఎం శ్రీలత విచ్చేయడం జరిగింది.దీంతో పాటు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి భవిష్యత్తును మంచిగా మరల్చుకుని మంచి స్థానంలో ఉండాలని వారికి తెలియజేశారు.అలాగే ఆడవాళ్ళ పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు పట్ల అవగాహన పెంచుకొని ఆడవారిని గౌరవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య,ఓ ఎస్ ఏ డాక్టర్ వేణు,ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ శ్రీనివాసరావు,రాజా,వెంకటేశ్వర్లు కళాశాల టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షా అవార్డ్స్‌లో పాఠశాలలు విద్యకు

మూలస్తంభాలుగా గుర్తించిన లీడ్ గ్రూప్

తిరుపతి విద్య 22,అక్టోబర్ ప్రభాతవార్త: భారతదేశంలోని ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ గ్రూప్ భారతదేశంలోని అతి పెద్ద పాఠశాల అవార్డుల కార్యక్రమాలలో ఒకటైన శిక్షా అవార్డులను విజయవంతంగా అందించింది.వరుసగా రెండవ సంవత్సరం,లీడ్ గ్రూప్ అందించిన శిక్షా అవార్డులు, భారతేదశంలోని విద్యార్థుల అభ్యాసాన్ని మారుస్తున్న విద్యా నైపుణ్యం పట్ల అచంచలమైన అంకితభావాన్ని కలిగి ఉన్న అసాధారణమైన పాఠశాలలు మరియు పాఠశాల నాయకులను గుర్తించి వేడుక చేశారు.ఈ పాఠశాలలు,స్థానం లేదా పరిమాణంతో సంబంధం లేకుండా,ఖచ్చితమైన తయారీ,బోధన,మూల్యాంకనం మరియు నివారణ ద్వారా తమ తరగతి గదులలో ఎస్ సి ఎఫ్-సమలేఖనం చేయబడిన మల్టీమోడల్ అభ్యాసాన్ని విజయవంతంగా అమలు చేశాయి.విద్యార్థుల నేతృత్వంలోని సమావేశాలతో సహా పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థుల విద్యలో తల్లిదండ్రుల ప్రమేయాన్ని మెరుగుపరుస్తున్నారు.మరియు విద్యార్థుల విశ్వాసాన్ని పెంచుతున్నారు.

ఎమ్మెల్యే పులివర్తి నానికి సుధాకర్‌రెడ్డి సన్మానం

తిరుపతిరూరల్,నవంబర్07 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండల సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానిని చిగురువాడ ఎంఎ టిసిభర్తవేమూరిసుధాకర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

అవినీతి రహితుడనని సత్య ప్రమాణం చేయగలవా..?

చెవిరెడ్డికి టిడిపి నాయకుల సవాల్

చంద్రగిరి, నవంబర్ 7 ప్రభాతవార్త: అవినీతి రహి తుడనని సత్యప్రమాణం చేయగలవా అంటూ మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి టిడిపి నాయకులు సవాల్ విసిరారు. శ్రీనివాస మంగాపురంలోని శ్రీవినాయక స్వామి వారి ఆలయం వద్ద మాజీ ఎంఎల్ఏ అవినీతి పరుడని గురువారం టిడిపి నాయకులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్ రాజారెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి తన ఇష్ట దైవమైన తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట పులివర్తి నానిపై చేస్తున్న ఆరోపణలు నిజమని సత్య ప్రమాణం చేయాలని సవాల్ చేశారు. ఆర్థిక బలంతో వైసిపి పత్రికలో, సోషల్ మీడియాలో అసత్య కథనాలతో మా ఎంఎల్ఏతో పాటు టిడిపి క్యాడర్‌ను నైతికంగా దెబ్బతీయాలని చూస్తున్నట్లు తెలిపారు. చెవిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఇసుక, మట్టి అక్రమ రవాణా, భూకబ్జాలతో వందల కోట్లు ఆర్జించారని ఆరోపించారు. చెవిరెడ్డి అవినీతిపరుడనితుమ్మలగుంట ఆలయం వద్ద తాము ప్రమాణం చేయడానికి సిద్ధంగా వున్నట్లు తెలిపారు.

పాలియేటివ్‌పై ఎస్‌బిఐసిసిఎఆర్ అవగాహన కార్యక్రమం

తిరుపతి, హెల్త్ నవంబర్ 7, ప్రభాతవార్త టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ తిరుపతి ఆంకాలజీలో పాలియేటివ్ కేర్ ముఖ్యమైన పాత్ర గురించి అవగాహన కల్పించడానికి ఒక విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాటా మెమోరియల్ సెంటర్ మాజీ డైరెక్టర్ సర్జికల్ ఆంకాలజీ హెడ్ డాక్టర్ రాజేంద్ర ఏ బద్వే మాట్లాడుతూ 70 శాతం మంది రోగులలో వ్యాధి ముదిరిన దశలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ జరుగుతున్న చోట పాలియేటివ్ కేర్‌కు భారతదేశంలో డిమాండ్ పెరుగుతుందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 10 లక్షల కంటే ఎక్కువగా కొత్త క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయని వాటిలో అత్యధికలు వ్యాధి ముదిరిపోయిన వారు ఉన్నారని తెలిపారు. అటువంటి వారికి సంరక్షణ ఇస్తున్నామన్నారు.

తిరుపతి డివిజన్

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి వుండాలి

పుత్తూరు, నవంబరు 7 ప్రభాతవార్త : క్యాన్సర్ వ్యాధి గురించి విద్యార్థులు అవగాహన కలిగి వుండాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. గురువారం కాలేజీలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల పలువురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. భారతదేశంలో స్త్రీ, పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్, వక్షోజ క్యాన్సర్ ఎక్కువగా వ్యాపిస్తోందన్నారు. తగిన అవగాహన పెంపొందించుకుంటే వ్యాధి వ్యాప్తిని తగ్గించుకోగలమన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన వుంటే వారి కుటుంబాలతో పాటు గ్రామీణ ప్రాంతాల వారిని క్యాన్సర్ వ్యాధి నుంచి రక్షించవచ్చన్నారు. పోషకాహారం, తగినంత వ్యాయామంతో పాటు నిర్ణీత వ్యవధిలో ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా నివారించవచ్చని వివరించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా వుండడం వల్ల కూడా క్యాన్సన్ వ్యాధిని నివారించుకోగలమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, జంతు శాస్త్ర విభాగం ఇన్ ఛార్జ్ డాక్టర్ శ్యామ్‌సన్ రాజు, అధ్యాపకులు డాక్టర్ వెంకటకృష్ణయ్య, డాక్టర్ షర్మిల పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టూరిజం శాఖలో గతంలో జరిగిన అవినీతిపై

సిబిఐ విచారణ జరపాలి, జనసేన నేత కిరణ్ రాయల్

**తిరుపతి హెల్త

మాంబట్టు పరిసరాల్లో నాణ్యమైన విద్యుత్

- వర్చువల్ పద్ధతిలో సీఎంచే సబ్‌స్టేషన్ శంకుస్థాపన

తడ, నవంబర్ 7 ప్రభాతవార్త : తడ మండలంలో అపాచి, ఇతర పరిశ్రమలు విస్తరించిన మాంబట్టు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. 43.53 కోట్ల వ్యయంతో 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన గురువారం జరిగింది. చంద్రబాబు గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సిఆర్‌డిఎ పరిధిలో ఒక కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా మాంబట్టు సబ్‌స్టేషన్ శంకుస్థాపన కూడా జరిగింది. సూళ్లూరుపేట వద్ద మన్నారు పోలూరులోని 220/132 విద్యుత్ ఉపకేంద్రం వద్ద ఇందుకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరణ చేశారు. మాంబట్టులో కాకుండా మన్నారుపోలూరు వద్దనే సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన హెచ్చుతగ్గులు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాంబట్టు విద్యుత్ ఉపకేంద్రం నుంచి మాంబట్టు సెజ్, అపాచి సెజ్, తడ, భీములవారిపాలెం, అక్కంపేట, కాదలూరు తదితర ప్రాంతాలకు ఇకపై నాణ్యమైన విద్యుత్ లభిస్తుందని ఆయన చెప్పారు. పారిశ్రామిక వినియోగదారులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు మూడు లక్షల మంది లబ్ధిదారులకు గృహ మరియు వ్యవసాయానికి సంబంధించి నాణ్యమైన విద్యుత్ అందించగల మని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, తడ ఎంపిపి కొళవి రఘు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు తిరుపతి జిల్లా విద్యుత్‌శాఖ ఏఇ విజయన్, ఇఇ శ్రీనివాసులు, డిఇఇ శేఖర్, తడ ఏఇఇ మురళీ, ఏపి ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల ఆలయంలో విగ్రహ స్థాపన,కలశ స్థాపన

శ్రీకాళహస్తి నవంబర్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో గత ప్రభుత్వంలో నియమించిన ధర్మకర్తల మండలి ఏడుగంగమ్మల ఆలయంను ఆధునీకరించుటకు రూ.40లక్షలతో కొత్త ఆలయాన్ని నిర్మించుటకు మంజూరు చేసారు. వచ్చేనెల జరగనున్న ఏడుగంగమ్మల జాతర సందర్భంగా ఈ ఆలయాన్ని పూర్తి చేయించారు. గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేరువేరుగా పూజలు జరిపారు. దేవస్థానం సారధ్యంలో ఆలయ ఆవరణలో సంప్రదాయ బద్ధంగా కలశ స్థాపన గావించారు. హోమాలు నిర్వహించారు.కలశ స్థాపన గావించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, పౌరోహితులు అర్థగిరి స్వామి పూజలునిర్వహించగా ఆలయం తరఫున డిఇఇ శ్రీనివాసులురెడ్డి, లోకేష్‌రెడ్డి, దామోదరం, పి,స్వర్ణమూర్తి పాల్గొన్నారు. కాగా మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏడుగంగమ్మల అమ్మవారి విగ్రహ స్థాపన,కలశ స్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహస్థాపన కార్యక్రమాల్లో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఏఇ వేణుగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్, బాలాజి, స్థపతి కుమార్, అర్చకులు గోపి, పరమేశ్వర్, ఏడుగంగమ్మల కమిటి అధ్యక్షులు అంజూరు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులు స్వర్ణమూర్తి, షణ్ముగం, మొగరాల గణేష్, జలకం కిషోర్,నాగముని,శంకర్, విజయకుమార్, లక్ష్మీపతి, బాల,సుధాకర్,మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

రేణిగుంట,నవంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పలు విద్యుత్ సబ్‌స్టేషన్లకు గుంటూరు జిల్లా తాళ్ళయ్యపాళెం నుంచి వర్చువల్ విధానంలో భాగంగా గురువారం తూకివాకం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ విద్యుత్‌శాఖకు చెందిన వివిధ స్థాయి అధికారులు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల దాదాపు 50 వేల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించగలమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గృహ, తిరుమల యాత్రికులు, వాణిజ్య సముదాయాలకు నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం సబ్‌స్టేషన్‌నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల ఒల్టేజీల హెచ్చు తగ్గులు అదుపులోకి వస్తాయన్నారు. శిలాఫలక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సురేంద్రనాయుడు, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్, ఎంపీటీసీ ఆనందరావు, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, వివిధ హోదాల విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌సబ్ స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం

తోటకనమ వద్ద 38కోట్లతో నిర్మాణం !!

వి.కోట, నవంబర్ 7 ప్రభాతవార్త : ఎపి ట్రాన్స్‌కో వారి ఆధ్వర్యంలో మండలంలోని తోట కనమ వద్ద 38కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సిఎం చంద్ర బాబు నాయుడు గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. సిఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో సబ్‌స్టేషన్ ప్రారంభించగా తోటకనమలో కలెక్టర్, ఎమ్మెల్యేలు కలసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసబ్ స్టేషన్ ఏర్పాటుతో వి.కోట, బైరెడ్డిపల్లి, శాంతిపురం మండలాల్లో వ్యవసాయ, గృహావసరాలకు మెరుగైన విద్యుత్ అందించడం జరుగుతుంద న్నారు. 46వేలమందికి వినియోగంలో రావడం జరిగిందన్నారు. ఒల్టేజ్‌లో హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ ప్రసార నష్టముల పరిష్కారం అవుతుంది. వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఒ భవాని, ఇఇలు శ్రీనివాసమూర్తి, చంద్రశేఖర్, ఎడిఇ చిన్నప్ప, ఎడి గణేష్ రెడ్డి, తహశీల్దార్ పార్వతి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రూ.77కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

శ్రీకాళహస్తి నవంబర్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట తూకి వాకంలో రూ.77కోట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు శంకు స్థాపన చేయటం ఎంతో సంతోషమని సిఎంకు ధన్యవాదాలను గురువారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచుటకు ముఖ్యమంత్రి ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నారని సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతన్నలు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను తొలగించుటకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని అందులో భాగంగా పుణ్యక్షేత్రంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు రూ.77కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకు స్థాపన చేయటం శ్రీకాళహస్తి నియోజకవర్గంపై ఆయనకు గల గుర్తింపుకు నిదర్శనం అని సుధీర్‌రెడ్డి అన్నారు.

జివిఆర్ ఫ్యాక్టరీపై ఇన్‌కం ట్యాక్స్ తనిఖీలు

కోట, నవంబర్ 7 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడులోని జివిఆర్ ఫ్యాక్టరీలో గురువారం ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు ఈ తనిఖీలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో భీమవరంలో పవన్ కల్యాణ్‌పై జివిఆర్ ఫ్యాక్టరీ ఎండి పోటీ చేసి గత ఎన్నికల్లో ఓడించారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈ తనిఖీలు చేపడుతున్నట్లు రాజకీయ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

హద్దులు దాటిన వైకాపా సోషల్ మీడియా

- తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు - ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, నవంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో వైకాపా సోషల్ మీడియా హద్దులు దాటి ప్రవర్తిస్తోందని.. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చిత్తూరుశాసనసభ్యులు గురజాల జగన్‌మోహన్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, హోంశాఖ మంత్రి అనిత, మంత్రి నారా లోకేష్ వారి కుటుంబసభ్యుల పట్ల వైకాపా అనుకూల సోషల్‌మీడియా అల్లరిమూకలు వికృతంగా పోస్టులు పెట్టడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులపై సభ్యసమాజం తలదించుకొనేలా పోస్టులు పెడుతూ వైకాపా నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రప్రజలు వైకాపాను చీదరించుకొన్నా ఆ పార్టీ వారికి బుద్ధిరాలేదని, వీటన్నింటికి త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. సోషల్‌మీడియా సైకోలకు చెక్‌పెట్టేందుకు పోలీసుశాఖను ప్రక్షాళన చేసి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి మరింత పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు సోషల్‌మీడియా వేదికగా అవాస్తవాలు, అసత్యాలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

చిరుత దాడిలో పాడి ఆవు మృతి

చౌడేపల్లి, నవంబర్ 7 ప్రభాతవార్త : చిరుత దాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన గురువారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ చుక్కావారిపల్లికి చెందిన ఎస్.నాగరాజుకు పాడి ఆవులున్నాయి. యదావిధిగా వాటిని గ్రామానికి సమీపంలోని మరుదుమలై అడవిలోకి మేతకోసం తరలించాడు. అడవిలోని కార్సేనికుంట వద్ద ఆవులుండగా చిరుత మందపై దాడి చేసిందని రైతు తెలిపాడు. ఈ దాడిలో రూ. 80వేలు విలువ చేయు పాడి ఆవు మృతి చెందిందని రైతు వాపోయాడు. వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత సమయంలో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నామనీ, అవికాస్తా అడవి జంతువుల బారిన పడి మృతి చెందుతున్నా యన్నాడు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అడవి జంతువుల నుంచి పశు సంపదను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మకు ..... ఆశ్రయం కల్పించడం

వెదురుకుప్పం, నవంబర్ 7 ప్రభాతవార్త : ఓ అనాథ అమ్మ చరమాంకంలో ఆలనపాలన చూసే వారు కరువై దుర్భర జీవనం సాగిస్తూ ... అరసరాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడు తుంది ... మానవతం మూర్తిభవించిన గొప్ప మనస్సున్న మహారాజులు స్పందించి ఆశ్రయం కల్పించాల్సి ఉంది. వివరాలలోకి వెళ్ళితే ... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె సచివాలయం ప్రక్కనేగల శిలావస్థకు చేరుకున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆమెకు ఆశ్రయం కల్పిస్తుంది. ఆమె తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువు ఆదిఆంధ్రవాడకు చెందిన నాగమ్మను మండలంలోని పాతగుంట ఆదిఆంధ్రవాడలో ఇచ్చి వివాహం చేశారు. కాగా ఆమెకు పిల్లలు లేకపోవడంతో సమీప బంధువులు ఉన్న తిరుమలయ్యపల్లె కొమ్ముఇండ్లకు చేరుకుని కూలీ పనులఉ చేసుకుంటూ జీవనం సాగించింది. ఐయితే వృద్ధప్యం మీదపడి అనారోగ్య సమస్యలతో కదలలేని పస్థితి ఏర్పడటంతో పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఆమెకు ఆశ్రయంగా మారిపోయింది. ఆలన పాలన చూసేవారు లేకపోవడంతో కూర్చున చోటునుంచి కదలలేక పోతూ తీవ్ర ఇబ్బందులుపడుతుంది. ప్రభుత్వం అందించే పింఛన్‌లో కొంత నగదు ఓ వ్యక్తి తీసుకుని ఆమెకు మూడుపూటల ఆహారం అందజేస్తున్నట్లు తెలుస్తోంది. కావు చరమాకంలో చూసుకోవలస్సిన లేక దుర్భర పరిస్థితిలో ఆశ్రా కోసం ఎదురు చూస్తున్న ఆ పండుటాకును ఆదుకోవలని స్థానికులు కోరుతున్నారు.

విదేశాల్లో వ్యాపారవేత్తలు కావడం గొప్ప విషయం : ఎమ్మెల్యే

పుత్తూరు, నవంబరు 7 ప్రభాతవార్త : విదేశాల్లో వ్యాపారవేత్తలు కావడం గొప్ప విషయమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. అమెరికా పర్యటనలో వున్న ఆయన అయోవా రాష్ట్రంలో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రులకు చెందిన ఇండియా మార్ట్ నిత్యావసర సరుకుల దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు ఆరి విద్యాధరి, సురేఖ, రంజిత్, కవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవిలాల చెరువు అభివృద్ధి కొరకు అధ్యయన కమిటీ : కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 7 ప్రభాతవార్త : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువు అభివృద్ధి కొరకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేసి వారు రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, జెసి శుభం బన్సల్, టీటీడీ సిఈ సత్యనారాయణ తదితర అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించి సమీక్షిస్తూ అవిలాల చెరువును ఎన్జిటి నిబంధనలకు లోబడి అభివృద్ధి చేయుట కొరకు ఒక కమిటీని టీటీడీ సిఈ, ఇరిగేషన్ ఈఈ, పిడి ఎన్హెచ్, ఆర్డీఓ తిరుపతి, తుడా సెక్రెటరీ లతో ఏర్పాటు చేసి రెండు వారాల్లో నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో తుడా సెక్రెటరీ డా. వెంకట నారాయణ, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణ భూషణ్ రెడ్డి, ఆర్డీఓ తిరుపతి రామ్మోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సనాతన వైదిక ధర్మాన్ని కాపాడండి: ఎస్‌సివి

టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు,జ్యోతుల నెహ్రూలకు సూచన

శ్రీకాళహస్తి నవంబర్ 7 ప్రభాతవార్త : టిటిడి బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన బిఆర్‌నాయుడు, సభ్యుడుగా నామినేట్ చేయబడిన జ్యోతుల నెహ్రూను గురువారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ఆయన సహోచరులు తిరుమలలో మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించి దుశ్శాలువతో సత్కరించారు. గతంలో ఐదేళ్ళు టిటిడి అంటే ఓ రాజకీయ పునరావస కేంద్రంగా మార్చుకొని అస్తవ్యస్తం చేసారని ఎస్‌సివి నాయుడు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యుడు జ్యోతుల నెహ్రూలకు సూచించారు. నేడు సమర్థుడైన ఛైర్మన్ బి ఆర్ నాయుడుకు పగ్గాలు అందించడం అభినందనీయం అన్నారు. ఆయనకు చక్కటి టీంను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు రూపకల్పన చేసి అందించారన్నారు. తిరుమలకు గతంలో ఉన్న పేరును మళ్ళీ పూర్వవైభవం తీసుకురావటానికి ధర్మకర్తల మండలి కృషి చేయాలని సూచించారు. ఆయనతో పాటు తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు తక్కల పాటి ప్రకాష్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు, గోగినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా రాజ్యపురస్కార్ ప్రశంసాపత్రం

శ్రీకాళహస్తి, నవంబర్ 7 ప్రభాతవార్త : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ అవతరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని భవన్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర వ్యాప్తంగా 10మంది స్కౌట్స్ విద్యార్థులను ఎంపిక చేసి రాజ్యపురస్కార్ సర్టిఫికెట్లను అందించారు. శ్రీకాళహస్తి బాబుఅగ్రహారం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సిఎస్.శ్రీనివాసులను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపిక చేయడంతో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈకార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ముఖ్యకమిషనర్ విజయరామరాజు, కార్యదర్శి మేరీచంద్రకళ, శ్రీకాళహస్తికి చెందిన స్కౌట్స్ మాస్టర్ ఎస్‌కె.అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడిచెత్త నిల్వ కేంద్రం తనిఖీ

తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: కొండపై లక్షమందికి పైగా వస్తున్న భక్తులు రోజువారీగా ప్రోగవుతున్న తడి,పొడి చెత విభజన, వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలని, దీనివల్ల ఎక్కడా అపరిశుభ్రత నెలకొనకూడదని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కొండపై ప్రోగుచేస్తున్న చెత్తను తీసుకెళ్ళి కాకులకొండ వద్ద డంప్‌చేస్తున్న ప్రాంతాన్ని గురువారం ఉదయం జోరువానలోనూ ఆయన పరిశీలించారు.

వైభవంగా సూరసంహారం వేడుకలు

నగరి, నవంబరు 7 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో సూరసంహారం పూజలు వైభవంగా జరిగాయి. గురువారం ఉత్సవాల్లో 6వ రోజు షష్టి కావడంతో ఆలయాలు హరోంహర నామస్మరణతో మారుమోగాయి. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి చందన, పంచామృతాభిషేకాలు చేసి కలువ పూలతోను, చామంతి పూలతోను సుందరంగా అలంకరించారు. ఉత్సవ ఉభయ దారులకు ఆలయ నిర్వాహకులు మర్యాదలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఈశ్వరగుడి వీధిలో సూరుని ప్రతిమను బాణసంచాల ద్వారా పేల్చి సూరసంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పని చేయని డిస్‌ప్లేలు

-ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

రేణిగుంట, నవంబరు 7 ప్రభాతవార్త: రేణిగుంట రైల్వేస్టేషన్ 3,4 ప్లాట్‌ఫాంలపై ఉన్న డిస్‌ప్లే బోర్డుల్లో రైళ్ళ కోచ్ పొజిషన్ల స్థితిగతులు పని చేయకపోవడంతో గురువారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణఎక్స్‌ప్రెస్‌తో పాటు వివిధ రైళ్లు, 2వ, 3వ నంబర్లు ప్లాట్‌ఫాంపైకి వస్తున్నాయని రైల్వే అనౌన్స్ మైక్‌ల్లో ప్రకటన చేశారు. అయితే రైలు పొజిషన్లకు తెలియజేసే డిస్‌ప్లేలు పని చేయలేదు. అనౌన్స్‌మెంట్ శాఖ నుంచి ఒక్కసారి మాన్యువలా కోచ్ పొజిషన్లను అనౌన్స్ చేసి రైల్వే అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రయాణికుల ఇబ్బందులకు తగ్గట్టు గురువారం ఆదిలాబాద్ వైపు వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్ కోచ్ పొజిషన్లు మారాయి. రైలు ప్లాట్‌ఫారంపైకి వచ్చింది. రైలు కేవలం రెండు నిమిషాలు మాత్రమే ఆగింది. ప్రయాణికులు వారి కోచ్‌లు వెతుకోవడానికి పడిన ఇబ్బందులు అంతా ఇంతా కాదు. కొన్ని భోగిలకు రైలు లోపలి ప్రయాణికులు దోర్లు వేయడంతో రైలు వెళ్లే హడావిడిలో కొంత మంది తమ రిజిర్వేషన్ కోచ్‌లలో ఎక్కలేక తప్పని సరి పరిస్థితిలో జనరల్ భోగిలో ఎక్కారు. రెండు రోజుల క్రితం రేణిగుంట రైల్వేస్టేషన్‌ను ఎంపీ సీఎం రమేష్ చైర్మన్‌గా స్టాండింగ్ కమిటీ పరిశీలించి వెళ్లింది. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, గుంతకల్ డివిజనల్ మేనేజర్లు తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పి రెండు రోజులు కాకముందే రైల్వే అధికారుల నిర్లక్ష్యం బట్ట బయలైంది. రెండు, మూడు నంబర్ల ప్లాట్‌ఫాంలపై డిస్‌ప్లే బోర్డుల్లో కోచ్‌ల పొజిషన్‌పై ప్రభాతవార్త ప్రతినిధి స్టేషన్ మేనేజర్‌ను వివరణ కోరగా పని చేయడం లేదండి అంటూ చాలా నింపాదిగా సమాధానం ఇచ్చారు. ఇదిలా ఉండగా అసోబుస్సు మంటూ ప్రయాణికులు రైలు ఎక్కారు. తిరుపతి నుంచి బయలుదేరిన కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లోని కొన్ని భోగిల్లో నీళ్లు రాకపోవడం రైల్వే శాఖ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనం.

దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రేణిగుంట, నవంబరు 7 ప్రభాతవార్త: రేణిగుంట అర్బన్ పోలీసులు అనేక దొంగతనాలకు పాల్పడిన శ్రీకాళహస్తికి చెందిన పఠాన్ గౌస్ బాషా(65)ను గురువారం రేణిగుంట చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి పంపగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. వివరాలు ఇలా... శ్రీకాళహస్తి పూసల వీధికి చెందిన పఠాన్‌గౌస్ బాషా తిరుపతి జిల్లాలో అనేక దొంగతనాలకు పాల్పడ్డారు. ఇతనిపై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో సుమారు 30 కేసులునమోదయ్యాయి. ఇటీవల కరకంబాడి హైస్కూలులో దొంగతనం చేయబోయి లక్ష రూపాయలు విలువైన వస్తువులను ధ్వంసం చేశాడు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ శరత్‌చంద్ర పర్యవేక్షణలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బంది, ఐడీ పార్టీతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితుడిని రేణిగుంట పాత చెక్‌పోస్టు శ్రీనివాస జూనియర్ కళాశాల వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి పంపారు.

హైకోర్టు ఆదేశించిన విధుల్లోకి తీసుకోలేదని నిరసన

రొంపిచెర్ల, నవంబర్ 7 ప్రభాతవార్త : హైకోర్టు ఆదేశించిన తమను విధుల్లోకి తీసుకోలేదని సంఘమిత్రలు స్త్రీ శక్తి భవనం ఎదురుగా గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘమిత్రలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి తప్పు చేయకుండా తమను అన్యాయంగా తొలగించడం పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా న్యాయం జరగలేదని హైకోర్టుకు వెళ్ళామని తెలిపారు. కోర్టు తప్పు లేకుండా సంఘమిత్రలను ఎలా తొలగిస్తారని వారిని యథావిధంగా విధుల్లో కొనసాగించాలని హైకోర్టు అధికారులు ఆదేశించిన న్యాయం జరగడం లేదని వాపోయారు. పది రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదని అన్నారు. మండలంలో 14 మంది సంఘమిత్ర లను తొలగించారని చెప్పారు. తామందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్రలు గీత, రష్యా బేగం, ప్రమీల, ఉదయభాను, ధనలక్ష్మి, గీతారాణి, సుబ్బరత్న తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మెన్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే

తిరుపతిరూరల్,నవంబర్ 7 ప్రభాతవార్త: టిటిడి ఛైర్మెన్ బి.ఆర్. నాయుడుకు ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ఘన స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి పాలకమండలి ఛైర్మెన్‌గా ప్రమాణం చేసాక బి.ఆర్..నాయుడు తొలిసారిగా రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి గురువారం విచ్చేసారు. బి.ఆర్.నాయుడుని ఎమ్మెల్య